వేషంచూసి మోసపోకండి!

వసుంధర

బాగా ఆలోచించిన మీదట మాలతి సాంఘిక నవల తీసుకుని చదవడం మొదలుపెట్టింది.

ప్రస్తుతానికి నవల చదివే మూడ్ లేదు. కానీ నిద్ర పట్టక కాలక్షేపమయ్యే దారిలేక ఏదైనా పుస్తకం చదవాలని ఆమె అనుకుంది. మూడ్ లేనప్పుడు కూడా ఆమె చదవగలిగిన పుస్తకాలు డిటెక్టివ్ నవలలు. అయితే ఇప్పుడామె డిటెక్టివ్ నవల చదవడంలేదు.

భర్త పక్కన లేనప్పుడు మాలతి డిటెక్టివ్ కథలు చదవదు. ఎందుకంటే ఆమెకు విపరీతమైన భయం. నవల చదివేక ఇంట్లో ఏ శబ్దం వినిపించినా, గాలికి తెర కదిలినా తన నీడే గోడమీద పడినా—కూడా భయంగా ఉంటుంది.

భర్త ఆమెను ప్రోత్సాహిస్తూంటాడు—డిటెక్టివ్ నవలలు చదువుకునేందుకు. ఎందుకంటే—నవలలు చదవడం పూర్తికాగానే అతనడక్కుండానే దగ్గరగానే చేరి

పడుతుంటుంది. ఆ క్షణంలో అతనికి భార్య ముఖంలో పసి తనపు ఛాయలు గోచరిస్తాయి.

ప్రస్తుతం సాంఘిక నవల చదువుతున్న మాలతి పక్కన భర్త లేడు. అతనూళ్ళో లేడు. ఇంకా రెండు రోజులదాకా రాడు. ఊరికి వెళ్ళేటప్పుడు అతను మరీ మరీ చెప్పి వెళ్ళాడు_ధైర్యంగా ఉండమని! ఆమె అలాగే అంది కానీ ధైర్యం లేదు.

పొరుగువాళ్ళ అమ్మాయిని సాయంపడుకో బెట్టుకునేదే కానీ దురదృష్టవశాత్తూ ఆ పిల్ల బావ ఈమధ్యనే ఇక్కడకు వచ్చి తిష్ట వేశాడు.

మాలతి హఠాత్తుగా నవల చదవడం ఆపేసింది. కంగారుగా టైం చూసుకుంది. పదీ ఇరవై అయింది. చెప్పుకోదగ్గ రాత్రికిందే లెక్క! ఆ సమయంలో మూలుగు వినిపిస్తోంది_తనకు_స్పష్టంగా!

డిటెక్టివ్ నవల కలిగించిన భ్రమ అనుకునేందుకు వీల్లేదు. ఆమె చదువుతున్నది సాంఘిక నవల. అదీకాక ఆ మూలుగు స్పష్టంగా వినబడుతున్నది.

మాలతి వెంటనే మంచం దిగలేదు. ముందుగా ఆమెకు భయం కలిగింది. అది మూలుగా, దెయ్యపుకేకా అన్న విషయం ముందుగా ఆలోచించింది. అయితే ఆ మూలుగు అదే పనిగా వినిపించడంలేదు. ఉండి ఉండి ఆగి ఆగి వినిపిస్తోంది.

టైము పదీ నలభై అయేలోగా మాలతి నిద్రపోవడానికి కొన్ని వృధా ప్రయత్నాలు చేసింది. ఆమె ఆలోచనలన్నీ మూలుగుపైననే కేంద్రీకరించబడ్డాయి. ఆ మూలుగు అలా వినిపిస్తూనే ఉంది.

కాసేపయ్యాక మాలతి మంచంమీదనుంచి లేచింది.

ఆ మూలుగు ఎక్కణ్ణించి వస్తోందో, ఎలా వస్తోందో తెలుసుకుంటేగానీ తనకు నిద్రపట్టే అవకాశం లేదని ఆమెకు తోచింది. క్రమంగా ధైర్యం తెచ్చుకుని మంచం దిగింది. మూలుగు వీధివైపునుంచి వస్తోందని తెలుసుకోవ డానికి ఆమెకు ఎంతోసేపు పట్టలేదు.

ఇంట్లో అన్ని స్విచ్‌లూ వేసి వీధిగుమ్మం దగ్గరకు వచ్చింది మాలతి. ఇప్పుడు మూలుగు గట్టిగా వినబడుతోంది. అది తలుపులకు అవతలివైపునుంచి వస్తోంది. మూలుగుతున్నది మనిషే! కానీ ఆ మూలుగు అదోరకంగా విచిత్రంగా ఉంది.

మాలతి తలుపు తీయడానికి తటపటాయించింది. ఒక వేళ ఎవరైనా దొంగవాడు అలా నటిస్తున్నాడేమో?

వాడు దొంగాడయితే తనింట్లో ఏముంది—ఎత్తుకుపోవ డానికి?

ఇంట్లో తనూ—బాబూ తప్ప ఎవ్వరూ లేరు. బాబు అదృష్టవంతుడు. వాడు నిద్రపోతున్నాడు. తనకు నిద్ర పట్టడంలేదు.

దొంగాడు కాని పక్షంలో వాడు...

ఆ భయంకూడా మాలతికి ఎక్కువగానే ఉంది. ఈ రోజుల్లో ఆడదానికి పూర్వపు విలువలు లేవు. పెళ్ళయిం దని తెలిసినా మగాళ్ళకు వెధవ బుద్ధులు పోవడంలేదు. బస్సులో రష్‌గా ఉన్నప్పుడూ, సినిమాహాలు వద్ద గుంపు అదుపు తప్పినప్పుడూ, వగైరా అవకాశాలు వచ్చినప్పుడు మగవాళ్ళు అసభ్యంగా ప్రవర్తించడం ఆమెకు అను భవంలో లేకపోలేదు. అందువల్ల ఎవడైనా తనకోసం ఆశపడి వచ్చాడని ఆమె భ్రమపడినా ఆశ్చర్యంలేదు.

అయితే ఆ మూలుగు ఆమె చెవిలో పడుతూనేవుంది.

ఆమెలోని రకరకాల భయాలను జయించి-ఆమె చేత ఆఖరికి తలుపును తీయించగలిగింది. తలుపులు తీయగానే కనబడ్డ దృశ్యం మాలతిని నిశ్చేష్టురాల్ని చేసింది. భయమూ ఆశ్చర్యమూ ఒకేసారిగా కలిగాయామెకు.

ఒక మనిషి-పురుషుడే ఇంటి అరుగుమీద పడుకుని ఉన్నాడు. అతను గజగజ వణుకుతూ అప్పుడప్పుడు మూలుగుతున్నాడు. మనిషికి స్పృహ వుందో లేదో తెలియదు. మాలతి తలుపు తెరిచినప్పుడు వచ్చిన ప్రత్యేకమైన వెలుగు అతనిలో ఏవిధమైన మార్పునూ తీసుకు రాలేదు.

2

మాలతి ఒక అడుగు వెనక్కి వేసి వీధరుగులమీది లైటుస్విచ్ నొక్కింది. అరుగు ప్రకాశవంతమైంది.

ఆ మనిషి యింకా అలా వణుకుతూ మూలుగుతూనే ఉన్నాడు.

మాలతి ధైర్యంచేసి అరుగుమీదకు వెళ్ళి ఆ మనిషిని సమీపించింది. ఏ క్షణంలోనైనా ఆ మనిషి చటుక్కున లేచి తన్ను పట్టుకోవచ్చునన్న అనుమానమూ, భయమూ ఆమెకు కలిగింది. అయినా ఆమె ధైర్యం తెచ్చుకుంది. కొద్దిగా వంగి ఆ మనిషిని "ఏమండోయ్-" అని పిలిచింది.

ఆ మనిషి మూలుగు ఆపలేదు. వణకడం మానలేదు.

ఒకనిముషం తటపటాయించి మాలతి అతనిముందుగా కూర్చుని ఏదో అనుమానంతో అతని నుదుటిమీద చేయి వేసి చూసి ఉలిక్కిపడింది. అతని శరీరం సలసలా కాగిపోతోంది.

మాలతి మనసులోని భ్రమలన్నీ తొలగి పోయాయి.

హఠాత్తుగా ఆమెలోని మానవత్వం మేల్కొంది. అప్పుడే ఆమె ఈ లోకంలోకి వచ్చింది. వెంటనే ఆమెకు జ్ఞానేంద్రియాలు పనిచేయడం ప్రారంభించాయి. అప్రయత్నంగా ఆమె ముక్కు మూసుకుని "అబ్బ!" అనుకుంది!

అక్కడ భరించలేని వాసనగా వుంది.

ఆ పురుషుడికి ఎంతో వయసుండదు. గెడ్డం మాసి ఉంది. తైలసంస్కారంలేని జుట్టు. బట్టలు చిరిగిలేవుకానీ వాటికి అతుకులున్నాయి. అతను వాటిని ధరించి ఎంత కాలమయిందో తెలియదు కానీ అవి బాగా మాసి వున్నాయి. వాసన అతని బట్టలనుంచి వస్తోందో, ఒంటి నుంచి వస్తోందో చెప్పడం కష్టం. మనిషి చాలా అపరిశుభ్రంగా ఉన్నాడు.

మాలతి తటపటాయించలేదు. ఆమె అతన్ని తట్టి లేపడానికి అయిదారుసార్లు ప్రయత్నించి, ఆఖరికి బలవంతంగా లేవదీసి కూర్చోపెట్టింది.

అతనో పర్యాయం కళ్ళు తెరిచి లేచి నిలబడ్డాడు. ఆమె వైపు చూశాడు కానీ ఆ కళ్ళల్లో తెలివిలేదు. అతనికి జ్వరం చాలా ఎక్కువగా ఉన్నదని మాలతికి తోచింది. ఆమె అతన్ని ఇంట్లోకి నడిపించింది. అతని చేయిపట్టుకుని పడిపోకుండా జాగ్రత్తగా లోపలికి తీసుకువెళ్ళి మంచం మీద పడుకోబెట్టింది.

ఆ క్షణంలో అతను పరాయి మగవాడనీ, అతన్నింట్లో ఉంచుకోవడం ప్రమాదమని మాలతికి తోచలేదు. ఆ వ్యక్తి పడుకోగానే పదేళ్ళ కొడుకుని లేపి—"బాబూ గమ్మని మన డాక్టరుగారింటికివెళ్ళి అమ్మ అర్జంటుగా రమ్మంటోందని చెప్పి పిల్చుకునిరా—" అంది. బాబు విసుక్కుంటూనే వెళ్ళి డాక్టర్ని తీసుకువచ్చాడు.

డాక్టర్ ఆ మనిషిని సమీపిస్తూనే చటుక్కున ముక్కు మూసుకుని—"అబ్బా - ఇదెక్కడి వాసన? అమ్మా - మాలతీ—ఈయనెవరు? మీకు బంధువా?" అన్నాడు.

మాలతి పరిస్థితి చెప్పింది.

డాక్టర్ అతన్ని పరీక్షించి—ఏదో ఇంజక్షన్ చేశాడు. తన పెట్టిలోంచి ఏవో బిళ్ళలు తీసిచ్చి ఎలా వాడాలో చెప్పి—"ముక్కు మొహం ఎరగని వాణ్ణింట్లో పెట్టుకున్నావ్—ఏమైనా ప్రమాదం జరిగితే?—" అన్నాడు.

"అన్నింటికీ ఆ దేవుడే ఉన్నాడు—" అంది మాలతి.

"రేపటికి జ్వరతీవ్రత తగ్గవచ్చునేమో కానీ - ఇంకా రెండు మూడ్రోజులవరకూ ఇతను మంచంమీద ఉండక తప్పదనుకుంటాను. అంతవరకూ ఇతనివల్ల నీకే ప్రమాదమూ ఉండదు -" అన్నాడు డాక్టర్.

"నా ప్రమాదం సంగతి ఎలా ఉన్నా - అతనికి ప్రమాదం తప్పినట్లేనా డాక్టర్!" అంది మాలతి.

"అతనికేం ప్రమాదంలేదు..." అని వెళ్ళిపోయాడు డాక్టర్.

ఆరాత్రి తెల్లవార్లూ అతను మూలుగుతూనేఉన్నాడు. మాలతికి నిద్రలేకుండానూ చేశాడు.

మర్నాడుదయం ఎనిమిది గంటల ప్రాంతంలో అతనికి తెలివి వచ్చింది. ఓసారి చుట్టూ పరికించి - "నేనెక్కడున్నాను..." అన్నాడు.

ఆ సమయంలో మాలతి అక్కడే ఉంది. అతని ప్రశ్నకు సమాధానంగా ఆమె రాత్రి జరిగిన వివరాలన్నీ చెప్పింది.

"అమ్మా - నువ్వెవరో కానీ దేవతవు..." అన్నాడతను.

"నా సంగతి తర్వాత చూద్దాం కానీ మీరెవరో మీ వివరాలేమిటో చెప్పండి....'

అతను ఆమెవంక ఆరాధనా పూర్వకంగా చూసి - "నా వేషాన్ని చూసి మీరు అంటూ మన్నించే మనుషులే తక్కువ అక్కడే నీ గొప్ప గుణం తెలుస్తోంది. నేను సామాన్యుణ్ని. నా గురించి ఎవరికీ చెప్పుకోడానికి ఏమీ లేదు..." అన్నాడు. ఒక్క క్షణం ఆగి - "నేను నిన్ను మన్నించలేదని అన్యథా భావించకు. కన్న తల్లినీ, తోడ బుట్టిన చెల్లినీ నువ్వనిపిలిస్తేనే తృప్తిగా ఉంటుంది. నువ్వూ నన్నలాగే పిలు..." అన్నాడు.

మాలతి అతని వంక ఆశ్చర్యంగా చూసింది. అతని బుద్ధి మంచిదనీ - అతను చాలా తెలివైనవాడనీ మాట లనుబట్టి అనిపిస్తోంది. అయితే పరిచయం పెరిగాక కానీ మనుషుల అసలు రంగులు బయటపడవు.

"అయితే నిన్ను అన్నయ్యా అని పిలుస్తాను. నా కోరిక మన్నించి నీ బట్టలు మార్చుకో. వాసన భరించ లేకుండా ఉన్నాము..." అంది మాలతి.

అతను అదోలా నవ్వి - "చూడమ్మా - వాసనను భరించలేనని నువ్వు నిన్ను మోసం చేసుకుంటున్నావు. ఈ ప్రపంచమంతా మోసం, అన్యాయం, కుళ్ళు. ఆ విష యం మీ అందరికీ తెలుసు. అయినా ఆ వాసన భరించ గల్గుతున్నారు. అటువంటి మీకు నా వాసన భారం కాకూడదు. నేను చాలా అరుదుగా స్నానం చేస్తాను. అందుకే నా వంటికి ఈ వాసన. అయితే నా శరీరం స్నానానికి నోచుకున్న రోజున ఈ ప్రపంచంలోని శత కోటి అన్యాయాలలో ఒకటి తొలగించబడిందని అర్థం! నా వేదాంతం మీ కర్థంకాదు కానీ మీ ఇంట్లో ఉండ

డానికి నేను బట్టలు మార్చుకోవడం ఒక షరతు అయిన పక్షంలో నేను తక్షణం వెళ్ళిపోతాను. ఎందుకంటే నాకు ప్రస్తుతం ఒక బాధ్యత ఉంది. అదితీరేక స్నానానికి మీ ఇంటికే వస్తాను. అంతవరకూ స్నానం ప్రసక్తి నావద్ద రాకూడదు –" అన్నాడు.

అతని మాటలన్నీ జ్వరానికి సంబంధించిన సంధి ప్రేలాపనగా మాలతి భావించింది. –"ఈ జబ్బుతో ఇప్పుడెక్కడికి వెడతావులే – నీవు నచ్చితే ఇలాగే ఉండు –" అంది మాలతి.

తర్వాత డాక్టరు వచ్చినపుడు అతని మాటలు చెప్పింది మాలతి – "చిత్రమైన మనిషిలాగున్నాడే?" అన్నాడు డాక్టర్ ఆమె చెప్పినవన్నీ విని. అయితే ఆయన ఆ మనిషితో ఆట్టే మాటలు పెట్టుకోలేను. అతని వాసన భరించడం ఆయనకు కష్టంగా ఉంది.

"ఇతనికి జ్వరం తగ్గు ముఖం పట్టినట్లే..." అన్నాడు డాక్టర్ వెళ్ళేటప్పుడు.

ఆ మర్నాడు పొద్దున్నకు అతనికి నార్మల్ కు వచ్చింది. మాలతి ఎంత బలవంత పెట్టినా వినకుండా అతను వెళ్ళిపోవడానికి సిద్ధపడ్డాడు.

"ఒక్క రోజు పథ్యం తిని విశ్రాంతి తీసుకుని వెళ్ళన్నయ్యా –" అంది మాలతి.

"వద్దమ్మా – నీలా ఆదరించే ఆడవాళ్ళు ప్రపంచంలో అరుదు. నీ ఋణం తీర్చుకునే అవకాశం నాకు వస్తుందో రాదో తెలియదు. నీ కెప్పుడు కష్టం వచ్చినా నాకు కబురు పెట్టు –" అన్నాడతను.

"నీ చిరునామా...?" అంది మాలతి.

"ప్రస్తుతానికి ఈ ఊరి గోడ్లు. ఈ ఊరు వదిలి వెళ్ళే

టప్పుడు నీకు చెప్పి వెడతాను. నా పేరు జోగినాథం''
అన్నాడతను.

మాలతి అతనివంకే ఆశ్చర్యంగా చూస్తూ నిలబడింది.

3

''క్షమించాలి, మిస్టర్ జోగినాథం - మీ అనుమానా లకు ఆధారంలేదని చెప్పడానికి విచారిస్తున్నాను.''

''మీ విచారం సంగతి తర్వాత చూద్దాం - నావి అనుమానాలనీ, వాటికి ఆధారంలేదనీ ఎందు కనుకుంటు న్నారు?'' అన్నాడు జోగినాథం.

''ఎందుకేమిటి? ఎంత ప్రయత్నించినా ఒక్కటంటే ఒక్క క్లూ కూడా దొరకలేదు.''

''అందుకు కారణం మీ అసమర్థత కాకూడదా?''

''మిస్టర్ జోగినాథం! మీరు మాటలు జాగ్రత్తగా రానివ్వాలి. నేను బాధ్యత గల ప్రభుత్వోద్యోగినన్న విషయం మరిచి పోతున్నారు.''

''చూడండి. నాకు మీమీద ఏ విధమైన కోపమూ లేదు. నేను నిజం తప్ప ఇంకోటి మాట్లాడను. అందువల్ల మీకు కాస్త బాధ కలిగించినా - బాధ్యతగల ప్రభు త్వోద్యోగులు నిజాన్ని భరించగలగాలి. నేను మీ కిది వరలో చెప్పినవి అనుమానాలు కాదు. బేర్ ఫాక్ట్స్! అవి మీకు చెప్పడానికి కారణం మీరు బాధ్యతగల ప్రభుత్వోద్యోగులు కావడం. అయితే మీ బాధ్యతను మీరు సమర్థవంతంగా నిర్వహించలేకపోయారు. ఆ విష యాన్ని నేను తప్పక ఋజువుచేయగలను...'' అన్నాడు జోగినాథం.

''ఎవరికి?'' అన్నాడతను.

"ఎవరికో ఋజువుచేసి మిమ్మల్ని నవ్వులపాలు చేయవలసిన అవసరం నాకులేదు. నేనేం ఋజువుచేసినా మీకే చేస్తాను..." అన్నాడు జోగినాథం.

"నావల్ల కానిపని మీవల్ల నవుతుందనుకుంటున్నారా?

"మీరు సీబీఐకు చెందిన మనిషి. అయితే ఇంటి బయట మీ నేమ్ ప్లేట్ ఇంకో విధంగా తగిలించారు. అయినా మీరెవరో నేను తెలుసుకో గలిగాను. మీకు ముఖ్యమైన బాధ్యతకూడా అప్పగించాను. ఇవన్నీ ఎలా చేయగలిగా ననుకుంటున్నారు?"

"మిస్టర్ జోగినాథం _ మీరు నాకు చెప్పిన విషయాలు ఋజువుచేస్తే_మీరు చెప్పినట్లు వింటాను..." అన్నాడా సీబీఐ ఆఫీసరు.

"నేను చెప్పినట్లు వినడం మీవల్లకాదు..."అన్నాడు జోగినాథం.

"ఎందుకని?"

"మీరుకూడా నాకులా ఉండగలరా? అంటే_ఇలా గే స్నానం చేయకుండా, మాసిన బట్టలు కట్టుకుని..." అని నవ్వాడు జోగినాథం.

"ఏమిటి దానివల్ల ప్రయోజనం?"

"లక్ష్యం ఏర్పడుతుంది. నేననుకున్నది సాధించే వరకూ నేను స్నానం చేయను. బట్టలు మార్చను. లక్ష్మిణుడిలా నిద్రాహారాలు విసర్జించలేని నాకు సులువైన మార్గమిదే కనబడింది..." అన్నాడు జోగినాథం.

"అదికాదు మీరు చెప్పినట్లు వినడమంటే..." అని అతను నవ్వి _ "ఇప్పుడు మీరు చెప్పింది ఋజువు చేయగలిగితే, ఇంకమీదట మీరేమైనా చెబితే ఆ పనిసాధించి తీర్తాను." అన్నాడు.

"ఇప్పుడే నేను రంగంలో ప్రవేశిస్తున్నాను. అయితే అందుకు మీ సహకారం కావాలి. అది తప్పక లభిస్తుందని నా ఆశ!" అన్నాడు జోగినాథం.

4

సాంబయ్యగారింట్లో చాలా హడావుడిగా ఉన్నదా రోజు. మర్నాడు సాంబయ్యగారి ఏకైక సంతానం రాజారావు జన్మదినం! ప్రతి ఏటా పెద్ద ఎత్తున ఆ ఇంట్లో జరిగే వేడుక ఇది.

సాంబయ్య కోటీశ్వరుడు కాదు, లక్షాధికారికాదు, నాలుగు వేళ్ళు నోట్లోకి పోయేటంత ధనికుడు కూడా కావడానికి వీల్లేదు. అతను అతిమామూలు గుమస్తా! అతనికి తల్లి, తండ్రి ఉన్నారు. భార్య ఉంది. పదేళ్ళ కొడుకున్నాడు.

అతనికి వచ్చే జీతం ఇంటి ఖర్చులకు బొటాబొటీగా సరిపోతుంది. అయినా ఏటా కొడుకు పుట్టిన రోజు పండుగ అత్యంత వైభవంగా జరుపుకుంటాడు. అల్లారు ముద్దుగా పెరిగిన ఏకైక పుత్రుడి పుట్టిన రోజు విషయంలో మాత్రం అతను ఎంత ఖర్చయినప్పటికీ సందేహించడు.

ఊళ్ళో తెలిసిన వారందర్నీ పిలిచారు. పొరుగూళ్ళలో ఉన్న బంధువులక్కూడా ఆహ్వానాలు వెళ్ళాయి. ఇంట్లో పెద్ద ఎత్తున స్వీట్సు ప్రిపేర్ చేస్తున్నారు. ఇంట్లో బంధుజనం చాలామంది ఉన్నారు. ఛలోక్తులతో వాళ్ళందరూ సరదాగా సమయం గడుపుతున్నారు.

ఉన్నట్లుండి ఇంట్లోని ఓ ముసలమ్మ—"ఈ వేడుక ఎవరి గురించి జరుగుతోందో—వాడేడరా—" అంది.

"వాడు స్కూల్లో ఉన్నాడు..." అన్నారెవరో.

"ఏడిసినట్లే ఉంది. మనమంతా సరదాగా కబుర్లు చెప్పుకుంటూంటే వాడేమో ఈసురోమంటూ స్కూల్లో ఏడుస్తున్నాడా—ఎవర్నయినా పంపించి వాణ్ని ఇంటికి పిలిపించండి..." అందా ముసలమ్మ ఆజ్ఞను జారీ చేస్తున్నట్లుగా.

కొంతమంది పిల్లాడి స్కూలు పాడుచేయడం అనవసరమన్నారు. ఎలాగూ రేపు స్కూలు మానేస్తున్నాడుగా అన్నారు. అయితే మరి కొంతమంది ఒక్కరోజులో పిల్లాడి చదువు పాడయ్యేదేమీ లేదన్నారు. పుట్టిన రోజుపూట మానడం విశేషం కాదు—అంతకు ముందురోజు కూడా ఆనందించాలన్నారు. ఆఖరికి స్కూలుకు ఓ మనిషిని పంపాలనుకున్నారు. ఆ మనిషి పేరు వరహాలరావు.

వరహాలరావు ఉత్సాహంగా స్కూలుకు వెళ్ళాడు. అతను స్కూలుకు వెళ్ళేసరికి ఉండవలసిన క్లాసులో రాజారావు లేడు.

"సరిగ్గా పదిహేను నిమిషాల క్రితం ఎవరో సాంబయ్యగారు పంపగా వచ్చి రాజారావుని పిల్చుకుని వెళ్ళిపోయారు..." అన్నాడు క్లాసు టీచరు.

వరహాలరావు నిరుత్సాహంగా క్లాసులోంచి బయటకు వచ్చేశాడు. చేసేది యేమీ లేదు కాబట్టి అతను ఇంటికి తిరిగి వెళ్ళాడు.

"రాజు ఏడీ?" అంది రాజారావు తల్లి.

"వాళ్ళ నాన్నగారు యెవరో మనిషిని పంపి పిల్చుకు వెళ్ళారుట" అన్నాడు వరహాలరావు.

"రేపు పుట్టినరోజుగదా — ఏవో కొనడానికయ్యుంటుంది..." అన్నాడో ముసలాయన.

రాజారావు తల్లి నిరుత్సాహంగా—"ఇద్దరూ కలిసి బజా

రకు వెళ్ళేరంటే- ఓపట్నాన తిరిగిరారు. వాడడిగినవన్నీ కొనాలని ఆయన పంతం. ఆయన వద్ద నేదాకా అడగాలని వాడి పంతం. ఆఖరుకి దుకాణాలన్నీ మూయించి ఇంటికి వస్తారు...'' అంది.

‘‘ఎలాగైనా కుర్రాడు అదృష్టవంతుడు. తండ్రి గుమస్తా అయితేనేం, అడిగినవన్నీ కొనిపెడతాడు...'' అనుకున్నాడు వరహాలరావు మనసులో. అతని తండ్రి కాస్త ఉన్నవాడే. అయినా ఆయనకు డబ్బు పిచ్చి. ఉన్నంతలో నాలుగు డబ్బులు వెనకేసుకోందామనే ఆయన ఆలోచన.

ఇంతలో ఆఫీసునుంచి ప్యూన్ అప్పారావు వచ్చాడు. రాజారావు తల్లి ఆత్రుతగా ఎదురువెళ్ళింది. ‘‘అయ్యగారు పంపారండి. ఆఫీసులో అనుకోని పని తగిలిందండీ. కాస్త ఆలస్యంగా వస్తారుట. అబ్బాయిగారు స్కూల్నించి రాగానే వారికేమైనా కావాలంటే వరహాలరావుగారికి డబ్బిచ్చి బజారుకి పంపించమన్నారు—'' అన్నాడు అప్పారావు.

ఆవిడ కంగారుగా-‘‘ఏమిటీ-రాజు అక్కడలేడూ?'' అంది-

అప్పారావుకు విషయం అర్థంకావడానికి పదినిముషాలు పట్టింది. అతను కంగారుగా ఈ వార్త అందించడానికి ఆఫీసుకు పరుగెత్తాడు. ఈలోగా అంతా కలసి వరహాలరావుని మళ్ళీ స్కూలుకు పరుగెత్తించారు.

వరహాలరావు స్కూలుకు వెళ్ళి కనుక్కోగా-ఎవరో నీలం పాంట్, ఎర్ర చొక్కా వేసుకున్న సుమారు పాతికేళ్ళ మోడ్రన్ యువకుడు రాజారావును పిల్చుకుని వెళ్ళినట్లు చెప్పారు.

వరహాలరావు నీరసంగా మళ్ళీ రోడ్డుమీదకువచ్చాడు. అతను నాలుగడుగులు వేసేసరికి ఓ మనిషియెదురై "మీరు సాంబయ్యగారింటికొచ్చిన బంధువులు కదూ—" అన్నాడు.

"అవును—మీకెలా తెలుసు?" అన్నాడు వరహాలరావు.

"ఈ ఉత్తరం కాస్త సాంబయ్యగారి కందజేయండి" అన్నాడు ఆ మనిషి. వరహాలరావా ఉత్తరం అందుకోగానే ఆ మనిషి క్షణాలమీద అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

5

అప్పారావు చెప్పిన వార్త వింటూనే సాంబయ్య కంగారుపడ్డాడు. బెంగ, బాధ, భయం—అన్నీ ఆయన ముఖంలో ఒక్కసారిగా కనపడ్డాయి.

"ఏది ఏమైనా ముందుగా నేను పోలీసు రిపోర్టివ్వాలేమో!" అని మనసులోనే గొణుక్కున్నాడు. తన ప్రాణాలకు ప్రాణమైన కొడుకెక్కడైనా ప్రమాదం వాటిల్లుతుందన్న ఊహ తోస్తేనే ఆయన గజగజా వణికిపోతాడు.

ఒక్క క్షణంపాటు ఆయనకు కాళ్ళూ చేతులూ ఆడలేదు. ఆయన బుర్ర పనిచేసేలోగా ఎవరో ఆయన్ను సమీపించి—"సార్! మీ కక్కణ్ణించో టెలిఫోన్ వచ్చిందండి" అన్నారు. సాంబయ్య పరుగులాంటి నడకతో ఫోన్ వద్దకు వెళ్ళి రిసీవర్ యెత్తి "హల్లో - సాంబయ్య స్పీకింగ్..." అన్నాడు.

"సాంబయ్యగారా? నమస్కారం. మీ కుర్రాడి గురించి మీరేమీ భయపడకండి. ఇంటికెళ్ళి వరహాల

రావుతో మాట్లాడితే అన్నీ చక్కబడతాయి."

"ఎవరు మీరు?" అన్నాడు సాంబయ్య.

"నేనేనండీ బావగారూ-అనవసరంగా కంగారుపడి పోలీసు రిపోర్టిస్తే-అభాసవుతారని భయపడి ఫోన్ చేశాను" అంటూ ఫోన్ పెట్టేశాడు అవతలి వ్యక్తి.

తన్ను బావగారూ అని పిలిచిన ఆ వ్యక్తి ఎవరో సాంబయ్యకు తెలియలేదు. ఇంటికొచ్చిన బంధువుల్లో ఎవరో ఒకరయుండాలనీ-కంగారుగా ఫోన్ చేసి ఉంటాడనీ సాంబయ్య అనుకున్నాడు. ఆయన మనసు కాస్త తేలికపడింది.

సాంబయ్య ఇంటికి వెళ్ళేసరికి అంతా ఇంకా కంగారుగా ఉన్నారు. ఆయన హడావుడిగా "వరహాల్రా వేడీ?" అన్నాడు.

"వాడిక్కడే వున్నాడు..." అన్నారెవరో. అంతలో నే వరహాలరావు ముందుకు వచ్చి "ఏం పెదనాన్నా?". అన్నాడు.

"రాజారా వెక్కడ?" అన్నాడు సాంబయ్య ఆత్రుతగా.

వరహాలరావు కంగారుపడిపోయి "ఈ ప్రశ్న నన్నడిగితే నేనేం చెప్పగలను?" అన్నాడు నెమ్మదిగా.

సాంబయ్య తనకు వచ్చిన ఫోన్ వివరం చెప్పాడు. ఆయనలో ఇప్పుడు మళ్ళీ కంగారు మొదలయింది.

"అన్నట్లు-పెదనాన్నా-నీ కిమ్మని ఎవరో పెద్దమనిషి స్కూలుదగ్గర ఓ ఉత్తరం ఇచ్చాడు—" అంటూ జేబులోంచి కవరు ఒకటి తీసి సాంబయ్యకు అందించాడు వరహాలరావు.

సాంబయ్య ఆ కవరు అందుకుని చించాడు. అందులోని

ఉత్తరం పైకితీసి చదువుతూంటే ఆయన చేతులు వణుకుతున్నాయి. చదవడం పూర్తయ్యేసరికి ఆ కాగితం ఆయన చేతుల్లోంచి జారిపోయింది. ఆయన కుప్పలా నేలమీద చతికిలబడిపోయాడు.

“ఏమిటి రాసుందందులో?” అన్నారెవరో కుతూహలంగా.

“ఈ ఉత్తరానికీ రాజారావు కనిపించక పోవడానికీ సంబంధముంటుందని నా పాడు బుర్రకు తట్టనే లేదు...” అంటూ వరహాలరావు క్రిందపడ్డ ఆ కాగితం తీసి అందరూ వినేలా పైకి చదవసాగాడు.

“డియర్ సాంబయ్యా!”

నీ కొడుకుకోసం ఏమైనా చేయగలనని అంటూంటావు. అర్జంటుగా నాకో యాభై వేలు కావాలి. ఇవ్వగలవా? ఇస్తే నీ కొడుకు మళ్ళీ నీ ఇంటికి తిరిగి వస్తాడు. ఇవ్వకపోతే నీ కొడుకు శవం నీ ఇంటికి వస్తుంది. ఈ వార్త నీ నోరు దాటి పోలీసులకు వెళ్ళిందా—రాజారావు ఫినిష్! నీకు సరిగ్గా మూడే మూడు రోజులు గడువు. అంతకంటే నేను ఆగలేను. ఏ సంగతీ రేపు నీకు ఫోన్ చేసినప్పుడు చెప్పు. —ఇట్లు, నీ శ్రేయోభిలాషి”

అక్కడున్న బంధుజనంలో హఠాత్తుగా నిశ్శబ్దం ఏర్పడింది. ఆ నిశ్శబ్దం రెండు క్షణాలపాటు మాత్రమే నిలిచింది. మళ్ళీ గుసగుసలు ప్రారంభమై, కోలాహలం ప్రారంభమైంది. ఆ కోలాహలం మళ్ళీ నిశ్శబ్దంగా మారిపోయింది సాంబయ్య లేచి నిలబడడంతో.

“మీ అందరకూ ఒక చిన్న మనవి! ఈ క్లిష్ట పరిస్థితిలో నాకు కర్తవ్య బోధ చేయగలవారున్నారా? ఉంటే ముందుకు వచ్చి సాయం చేయండి...” అన్నాడు. ఆయన

కంఠంలో ఏడుపు జీర తెలిసిపోతుంది.

బంధుజనంలో ఎవరూ ముందుకు రాలేదు. ఏమని చెప్పాలో ఎవరికీ తోచడంలేదు. పోలీసులకు చెప్పమందామంటే – కుర్రాడి ప్రాణాలు పోవచ్చు. పోనీ డబ్బిచ్చి విడిపించుకోమందామంటే అంత డబ్బాకస్మాత్తుగా సామాన్య మధ్య తరగతి సంసారుల కెక్కణ్ణుంచి వస్తుంది?

ఎవరూ మాట్లాడక పోవడం చూసి సాంబయ్య మళ్ళీ అన్నాడు–"పోనీ–మీలో ఎవరైనా నాకు అప్పుగా తోచినంత డబ్బు సాయంచేయగలరా? అందరూ తలో అయిదువేలూ వేసుకుంటే యాభైవేలు పోగవడం కష్టం కాదు."

ఈ మాటలు అని సాంబయ్య అందరికేసి చూశాడు. ఎవ్వరూ మాట్లాడలేదు. చాలామంది ముఖకవళికలు కనిపించకుండా తలలు దించుకున్నారు.

"ఇంతకాలం నా సుఖాల్లో పాలు పంచుకోవలసిందిగా నేను కోరుతూంటే మన్నించి ప్రతి యేటా నా ఇంటికి వచ్చివెడుతున్నారు. అనుకోకుండా ఈ రోజు ఈ కష్టం వచ్చి పడింది. నాకష్టాల్లో సాయపడడానికెవ్వరూ ముందుకు రాలేరా?" అన్నాడు సాంబయ్య దీనంగా.

ఎవ్వరూ ముందుకు రాలేదు – "అంతా మధ్య తరగతి వాళ్ళమే – యేదో మాటసాయం, పనిసాయం అంటే మావల్లవుతుందికానీ ధనసాయం కావాలంటే ఎక్కడ కుదురుతుంది?" అన్నాడో ముసలాయన.

"అయితే దయుంచి అందరూ వెళ్ళిపోండి. నన్ను ప్రశాంతంగా ఆలోచించుకోనివ్వండి. ఎలాగూ పుట్టిన

రోజు వేడుక జరుగబోవడంలేదు. దేవుడు దయతల్చి మళ్ళీ సంవత్సరం పుట్టినరోజు వేడుక మా ఇంట్లో జరిగితే-మిమ్మల్నందర్నీ తప్పక పిలుస్తాను. వెళ్ళేముందో చిన్న విన్నపం. మా అబ్బాయి తప్పిపోయినట్లు మాత్రం ఎక్కడా అనకండి..." అన్నాడు సాంబయ్య.

రాత్రయ్యేసరికి-బంధుజనంతో కోలాహలంగా వుండిన సాంబయ్య ఇల్లు-బావురుమంటూ వుంది. వారి కుటుంబ సభ్యులలో యిప్పుడు ఓ మనిషి తక్కువగా వున్నాడు. అతను రాజారావు!

6

"రిక్షా ఆపు!" అంది మాలతి.

రిక్షా ఆగింది. అందులోంచి మాలతి, ఆమె భర్త దిగారు. మాలతి హడావిడిగా అడుగులు వేసి— "అన్నయ్యా!" అని పిలిచింది.

రోడ్డుపక్క కూర్చుని ఆకాశంకేసి దిక్కులు చూస్తూ తనలో తనే నవ్వుకుంటున్న జోగినాథం ఉలిక్కిపడి "ఎవరూ?" అన్నాడు.

"నేనే అన్నయ్యా!" అంది మాలతి.

జోగినాథం ఆమెను గుర్తుపట్టాడు. చటుక్కున లేచి నిలబడి "ఏం జరిగిందమ్మా!" అన్నాడు. అప్పటికి మాలతి భర్తకూడా వచ్చి ఆమెపక్క నిలబడ్డాడు. అతను జోగినాథంవైపు జుగుప్సాకరంగా చూస్తున్నాడు...

మాలతి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "ఒక్కడంటే ఒక్క కొడుకు. వాణ్ణెవ్వరో ఎత్తుకెళ్ళిపోయారు..." అందామె.

"మీ అబ్బాయినెవరో ఎత్తుకుపోయారా? ఎందుకు?" అన్నాడు జోగినాథం.

"ఎందుకో తెలియదు. కానీ వాణ్ణి మేము ప్రాణాలతో తిరిగి చూడాలంటే పదివేలరూపాయలివ్వాలి. ఎక్కణ్ణించి తెచ్చేది?" అంది మాలతి.

"పోలీసు కంప్లయింటివ్వలేకపోయారా?"

"అ.. చేస్తే కుర్రాడి ప్రాణాలు దక్కవన్నారు. ఏం చేయాలో దిక్కుతోచక డబ్బుకోసం అయినవాళ్లనీ కానివాళ్లనీ దేబిరిస్తూంటే నువ్వు కనబడ్డావు. నీవల్ల ఏదైనా సాయం జరుగుతుందేమోనని..." అంది మాలతి.

మాలతి భర్త నవ్వి "బాగానే ఉంది వ్యవహారం. కట్టుగుడ్డలు ఉతికించుకోలేనివాళ్ళను డబ్బు సాయం అడుగుతున్నావు. నీకు మతిగానీ పోలేదు కదా?" అన్నాడు.

జోగినాథం అదోలా నవ్వి-"వేషం చూసి మోసపోకండి బావగారూ! రేపుదయానికి మీకు పదివేల రూపాయలిస్తాను. దాంతో మీ పిల్లాడిని విడిపించుకుందురుగాని..." అన్నాడు.

"నిజంగానా—" అంది మాలతి.

"నన్ను నమ్ము. ఇంత త్వరగా నీకు సాయపడే అవకాశం వస్తుందనుకోలేదు. ఈ రాత్రికే అవసరమైన డబ్బు సంపాదించుకుని వస్తాను. తెల్లారేసరికి మీ ఇంటి ముందు డబ్బుతో ఉంటాను. ఆ డబ్బు మీరు నాకు తిరిగి ఇవ్వవలసిన అవసరంకూడా ఉండదు" అన్నాడు జోగినాథం.

"మూడంటే మూడురోజులు గడువిచ్చారు వాళ్ళు" అంది మాలతి.

"ఇలాంటి కేసు ఇదొక్కటేనా? ఇంకా యేమైనా జరిగాయా___? నీకేమైనా తెలుసా? ఈ సమాచారం నాకుపయోగపడుతుంది..." అన్నాడు జోగినాథం.

"నాకు తెలియదు. ఒకవేళ జరిగినా యెవరూ బయట పెట్టుకోరుకదా_అందరికీ హెచ్చరికలు అందేవుంటాయి" అంది మాలతి.

"సరేలే_నువ్వుమాత్రం నిశ్చింతగా ఉండు. నామాట నమ్మి నామీద గురి యేర్పరచుకున్నవాళ్లెవ్వరూ యింత వరకూ నష్టపోలేదు. అసంతృప్తి చెందలేదు. నీ కొడుక్కే ప్రమాదమూలేదు. నా అభయం లభించింది" అన్నాడు జోగినాథం. ఈ మాట లని అతను లేచి నిలబడ్డాడు.

"మాలతీ_నీకు పిచ్చిగానీ పట్టలేదుగదా_ఆ ముష్టివెధవ నెవణ్నో వరసపెట్టి అన్నయ్యా అని పిలవడమేకాక డబ్బు కూడా అడగడమేమిటి? వాణ్ణిచూస్తుంటేనే తెలియడం లేదూ_నెత్తిమీద రూపాయిపెట్టి అయిదుపైసలకమ్మినా వాణ్ణెవరూ కొనుక్కోరు..." అన్నాడు మాలతి భర్త చిరాగ్గా మాలతితో కలిసి తిరిగి వెళ్ళిపోతూ.

"ఏమోనండీ_యే పుట్టలో యే పాముందో..." అని ఊరుకుంది మాలతి.

7

జోగినాథం ఆ భవనం గేటుముందు ఓ పదినిముషాలు తచ్చాడాడు. ఆఖరికి నెమ్మదిగా లోపల ప్రవేశించబోయాడు.

"ఏయ్ ఆగు_" అన్నాడు కాపలావాడు.

"ఎందుకని?"

"ఈ క్లబ్ నీలాంటివాళ్ళకోసంకాదు."

"అఫ్టరాల్ కాపలావాడివి. నువ్వు నాకు చెప్పొచ్చేవా?" అన్నాడు జోగినాథం.

"నీలాంటివాళ్ళు లోపలకు వెళ్ళకుండా చూడ్డం కోసమేకదా నేనిక్కడ కాపలా కాస్తుంట?"

"అలాగే-అయితే అది నీ చేతకాని పని..." అంటూ జోగినాథం విసురుగా లోపలకు వెళ్ళబోయాడు. కాపలా వాడతన్ని పట్టుకుని వారించాడు.

"నిన్నోడించడం నాకు చాలా సులభం..."అన్నాడు జోగినాథం.

"ఎందుకని?"

జోగినాథం జేబులోంచి యాభైరూపాయల నోటుతీసి "తర్వాత నీ యజమానిముందు పొరపాటైపోయిందని ఒప్పుకున్నావనుకో. ఆ పొరపాటుకంటే ఈ డబ్బు వదులుకోవడమన్నది చాలా పెద్ద పొరపాటు—" అన్నాడు.

కాపలావాడా నోటును ఆప్యాయంగా అందుకుని— "నిన్ను నేను చూడలేదంటాను-నీ ఇష్టం. లోపలెలా మానేజ్ చేస్తావో" అన్నాడు.

జోగినాథం ఈలవేసుకుంటూ లోపల ప్రవేశించాడు' భవనంలోకి వెళ్ళబోయేముందు మరో వ్యక్తి అతన్ని అటకాయించాడు.

"ఈగోజు క్లబ్ అయిటమ్స్లో నాదే ఓ స్పెషల్ అట్రాక్షన్—" అన్నాడు జోగినాథం. అతన్నటకాయించిన మనిషి అతనివంక ఓ పర్యాయం సందేహంగా చూసి ఊరుకున్నాడు.

ఆ క్లబ్‌లో చాలామంది జోగినాథం వంక ఆశ్చర్యంగా చూస్తున్నారు. అక్కడ అందరూ ఘుమఘుమలాడి

పోతున్నారు. తళతళ మెరిసి పోతున్నారు. వారి మధ్యన జోగినాథం ఓ శాపగ్రస్థుడిలా ఉన్నాడు. వినా ఆతని ముఖంలో విచారంలేదు.

ఓ అయిదు నిముషాలు గడిచాక ఓ మనిషి జోగినాథాన్ని సమీపించి–"ఎవరు నువ్వు? ఇక్కడికెందుకు వచ్చావ్?" అనడిగాడు.

"నా పేరు జోగినాథం. అందరికిలాగే వచ్చాను." అన్నాడు జోగినాథం.

"ఇంపాసిబుల్. నువ్వు తక్షణం బయటకు వెళ్ళాలి.".

"అలా అనొద్దు. ఎందుకంటే మీ క్లబ్ ననుగ్రహించి ఈ రోజు కిక్కడికి వచ్చాను. నేను రేపు రమ్మన్నా రాను..." అన్నాడు జోగినాథం.

"నిన్ను రమ్మనడమా?" అని ఆ మనిషి హేళనగా నవ్వి–"ఇప్పుడు ఈ క్షణంలో నిన్ను బయటికి గెంటించగలను..." అన్నాడు.

"నాశక్తిని తక్కువగా అంచనా వేస్తున్నట్లున్నావు. నేను ఒక్క చేత్తో పదిమందికి సమాధానం చెప్పగలను. ఇక్కడ చాలా ఖరీదైన ఫర్నిచర్ కనబడుతోంది. అదంతా పాడుచేసుకోవాలనుకుంటే నన్ను బయటికి పంపడానికి ప్రయత్నించండి..." అన్నాడు జోగినాథం.

ఆ మనిషి ముఖంలో ఆందోళన కనబడింది–"అయ్‌సీ. అయితే క్లబ్ మెంబర్లకి వినోదం కలిగించే విధంగా నీకో పరీక్ష పెడతాను. అందులో నెగ్గితే నీకు వెయ్యి రూపాయల బహుమతికూడా ఉంటుంది..." అన్నాడు.

"వెయ్యి రూపాయలా? నేనింకా ఎక్కువ ప్లాను మీదవచ్చాను. అయితే నాశక్తి నీవు తెలుసుకోవాల్సిన అవసరముంది కాబట్టి అందాకా ఒప్పుకుంటున్నాను..."

"అయితే నాతో రా..." అన్నాడా మనిషి.

8

"ఫ్రెండ్స్! మీ అందరికీ ఇప్పుడొక అద్భుత వినోద ప్రదర్శనం. మన క్లబ్ ఛాంపియన్ వస్తాదు గుండూరావుతో—ఓ కొత్త వ్యక్తి పస్తీ పడతాడు. ఈ ప్రదర్శన మీకు కలిగించబోయే వినోదం పోటీదార్ల నిద్దర్శి చూడగానే మీరర్థం చేసుకోగలుగుతారు..."

క్లబ్ లోని వేదికపై దీపాలు వెలిగాయి. తెరతొలగింది. వేదికపై ఉన్న ఇద్దరు మనుషుల్ని చూసి సభికులు నివ్వెరపోయారు. వారిలో ఒకతను కండలు తిరిగి ఏనుగులా ఉన్నాడు. రెండోవాడు బక్కపలచగా ఉన్నాడు.

"నా పేరే గుండూరావ్!" అన్న మనిషి కండలు మెరుస్తున్నాయి.

అపరిశుభ్రంగా, బిచ్చిగాడిలా ఉన్న మనిషి సభికులకు చేతులు జోడించి_"నమస్కారం. నా పేరు జోగినాథం. మీరనుకున్నంత వినోదం ఈ ప్రదర్శన ద్వారా మీకు లభించదు. నా ప్రతికక్షిని చిత్తుచేయడాని కింతవరకూ అయిదు సెకన్లకి మించి నేను తీసుకోలేదు. మీరు ప్రత్యేకంగా కోరితే తప్ప ఈ ప్రదర్శన ఎక్కువ సేపు కొనసాగదు..." అన్నాడు.

తర్వాత గుండూరావు, జోగినాథాన్ని సమీపించాడు. చూసే వాళ్ళకి జోగినాథం ఏమైపోతాడోనన్న కంగారు కలిగింది.

అయితే జోగినాథం గుండూరావుని గమనిస్తూనే ఉన్నాడు. అతను తనని సమీపించగానే తమాషాగా కాలు విసిరాడతను. అది గుండూరావు మోకాలి ప్రాంతంలో తగిలింది. గుండూరావు మొదలు నరికిన

వృక్షంలా బోర్లాపడిపోయాడు. చటుక్కున జోగినాథం గుండూరావుని సమీపించి రెండు భుజాలమీదా రెండు దెబ్బలు వేశాడు.

తర్వాత సభికులవైపు తిరిగి—"అయ్యా—మన్నించాలి. గుండూరావుగారు లేవడానికి కనీసం పదినిమిషాలు పడు తుంది. ఈ రోజు కింక ఆయన పోటీలో పాల్గొనగలరని నాకు తోచడంలేదు. ప్రదర్శన నాలుగు సెకన్లలోనే ముగిసింది. ఏమీ అనుకోనద్దు—" అన్నాడు.

కరతాళధ్వనులతో హాలు దద్దరిల్లి పోయింది. ఈ పోటీ ఏర్పాటుచేసిన మనిషి జోగినాథాన్ని సమీపించి— "అద్భుతం! మా క్లబ్ చరిత్రలోనే ఇది ఒక అపూర్వ సంఘటన మిస్టర్ జోగినాథం—ఈ గంగాధరం మీకు సంతోషంగా వెయ్యి రూపాయల బహుమతి ఇచ్చు కుంటున్నాడు..." అంటూ పది వంద రూపాయిలనోట్లు అందించాడు.

"ఈ హాల్లో ఫర్నిచర్ లక్షరూపాల విలువచేస్తుంది. వెయ్యి రూపాయిల ఖర్చులో లక్షరూపాయల ఫర్నిచర్ని రక్షించుకున్నావ్ మిస్టర్ గంగాధరం. అభినందిస్తు న్నాను" అన్నాడు జోగినాథం. అప్పుడే హాల్లో కేకలు మొదలయ్యాయి. జోగినాథాన్ని తమ మధ్యకు తీసుకు రావలసిందిగా చాలామంది కోరుతున్నారు.

జోగినాథం మళ్ళీ మనుషుల మధ్యకు వెళ్ళాడు. అయితే ఎవ్వరూ అతిని వంక జుగుప్సాకరంగా చూడడం లేదు. కొంతమంది ఆడవాళ్ళు ఆరాధనా భావంతో చూస్తున్నారు కూడా! కొత్త కొత్త ఫేషన్లకోసం యువతరం గంగ వెర్రులెత్తుతున్న ఈ రోజుల్లో అతని వేషంకూడా బాగానే ఉందనిపించింది.

ఒకమ్మాయి ఛటుక్కున అతన్ని సమీపించి కొంగ నించుకున్నంత పనిచేసి_"అబ్బ-వాసన!" అని ముక్కు మూసుకుంది.

"చూశావా_నా కిష్టంలేని వాళ్ళనుంచి తప్పించుకోడానికి వాసన ఎంత ఉపయోగపడుతోందో_" అన్నాడు జోగినాదం.

"మిస్టర్ జోగినాథం..." అన్నాడు గంగాధరం. "మీరిక్కడకు వచ్చిన పనేవిటో చెబితే..."

"డబ్బు కావాలి..." అన్నాడు జోగినాథం.

"ఎంత?"

"పదివేలు..."

"చేతనైతే సంపాదించుకోవచ్చు. ఇంకో పది నిముషాల్లో మూడు ముక్కలాట ఆరంభం కానుంది..." అన్నాడు గంగాధరం.

"అందుకేగా లోపలకు వచ్చేను..." అని నవ్వాడు జోగినాథం.

"డబ్బుందా?"

"ఇక్కడకు వచ్చేక సంపాదించినదే ఉంది_వెయ్యి రూపాయలు."

గంగాధరం తడబడి_"మా క్లబ్ ఆటగాడు రమేష్ నింతవరకూ ఎవ్వరూ నెగ్గలేదన్న విషయం తెలుసా?" అన్నాడు.

జోగినాథం చిరాగ్గా_"అటు స్టేజికేసి చూడండి. పాపం కుందూరావింకా లేవలేదు. నిద్రపోతున్నాడో ఏమో!" అన్నాడు.

గంగాధరం కంగారుగా అక్కణ్నించి వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిపోయిన అయిదు నిముషాలకు అక్కడ దీపాలు

డిమ్ అయ్యాయి. సన్నగా పాశ్చాత్య సంగీతం వినిపించసాగింది.

పదిమంది నర్తకీమణుల బృందం ఒక అర్ధనగ్న నృత్యాన్ని ప్రదర్శించారు. ఆ డిమ్‌లైట్ల కాంతిలో ఆ నృత్యం మనుషుల్లో ఉద్రేకాన్ని కలిగించి, ప్రోత్సహించేదిగా వుంది. నృత్యం ముగింపుదశ చేరుకునేసరికి-నర్తకీమణులతోపాటు హాల్లోని పదిమంది మగవాళ్ళు కూడా అదృశ్యమయ్యారు. హాల్లో తిరిగి దీపాలు వెలిగాయి.

గంగాధరం జోగినాథాన్ని పలకరించి "ఎలా వుంది నృత్యం?" అన్నాడు.

"నేనిప్పుడే దేశంలో వున్నాను? అడుగుతీసి అడుగు వేస్తే అమ్మా, ఆకలి అని ఆక్రోశించే అభాగ్యులున్న దేశం ఇదేనా?" అన్నాడు జోగినాథం.

"ఛా-ఛా-ఒక్క రాత్రిలో పదివేలు సంపాదించడం కోసం కాపలావాడికి లంచమిచ్చి అక్రమంగా క్లబ్‌లో ప్రవేశించిన నువ్వు-ఈ సమయంలో అభాగ్యుల గురించి తలచుకుంటున్నావా? సిగ్గుగా లేదూ?" అన్నాడు గంగాధరం.

"ప్రజాక్షేమాన్ని కోరిన ధర్మరాజు ప్రజానాశనం కలిగించే యుద్ధానికి పాల్పడ్డాడు. దుర్మార్గుల్ని అణచడం కోసం అక్రమ యుద్ధం చేయడమేకాక, తనూ ఓ అబద్ధం కూడా ఆడాడు. మీ విషయంలో నేనేం చేసినా అది తప్పుకాదు..." అన్నాడు జోగినాథం.

"అదిసరే-అటు చూడు - ఆ వస్తున్నదే రమేష్!" అన్నాడు గంగాధరం.

జోగినాథం నిర్లక్ష్యంగా అటువైపు చూస్తున్నాడు.

సినిమా హీరోలను మించి అందంగా వున్న ఓ పడుచు

వాడు. అతనికి అటూ ఇటూ ఇద్దరమ్మాయిలు. ఏ స్వర్గాన్నించో సరాసరి దిగివచ్చిన రంభ, ఊర్వశిల్లా వున్నారు వాళ్ళిద్దరూ.

“ఆ ముగ్గురిలో రమేష్ యెవరు?” అన్నాడు జోగినాథం వెటకారంగా.

గంగాధరం కోపంగా జోగినాథంవంక చూసి–“ఆడదీ, మగదీ భేదం తెలియకుండా వుందా నీకు? ఇంక పేకేం ఆడతావ్!” అన్నాడు.

“ఆడవాళ్ళు పొడుగ్గా ఉండడం, మగవాళ్ళు పొట్టిగా ఉండడం పెద్ద విచిత్రమేం కాదు. వాళ్ళు ముగ్గురూ ఒకే రకమైన బట్టల్లో, ఒకేరకమైన హెయిర్ స్టెయిల్ లో వున్నారు. ఆడెవరో, మగ యెవరో నాకెలా తెలుస్తుంది?” అన్నాడు అమాయకత్వాన్ని నటిస్తూ జోగినాథం.

అప్పటికి ఆ పడుచువాడు జోగినాథాన్ని సమీపించి “ఎస్ ఐయామ్ మిస్టర్ రమేష్!” అన్నాడు.

జోగినాథం టైము చూసుకుని “మూడు ముక్కలాట ప్రారంభించడానికింకా యెంత వ్యవధి వుంది?” అన్నాడు.

“నేను వచ్చేశాగా–ఇప్పుడే ఈ క్షణంలోనే ప్రారంభము. నువ్వు సిద్ధమా?” అన్నాడు రమేష్. అతన్ని పక్కనున్న ఇద్దరమ్మాయిలూ జోగినాథం వంక వెటకారంగా చూసి నవ్వారు.

“మిస్టర్ రమేష్! ఐయాం మిస్టర్ జోగినాథం. నేనీ వేళ పెద్ద యెత్తులో వచ్చాను. ముందుగా నువ్వో రెండు రౌండ్లు వేసి నాలుగు డబ్బులు సంపాదించుకో...” అన్నాడు.

రమేష్ నవ్వి—"నేను పందెం కాసేదేమిటో తెలుసా?" అన్నాడు.

"తెలియదు?"

"వీళ్ళిద్దరూ ధరించిన దుస్తులకున్న జిప్స్, బటన్స్—బంగారానివి. వీటి ఖరీదే కొన్నివేలు చేస్తుంది. అవే నేను పందెంగా ఒడ్డుతాను. నన్ను నెగ్గగలిగినవారెవ్వరైనా సరే—ఈ సుందరాంగుల వలువలు నెగ్గుకుపోవచ్చు" అన్నాడు రమేష్.

"సరే—అది మొదటి పందెం. రెండో పందెం?..." అన్నాడు జోగినాథం.

రమేష్ ముఖం ఎర్రగా అయింది. "ఈ రమేష్‌తో రెండో పందెం ఆడిన మగవాడున్నాడా...?" అన్నాడు.

"అసలు నువ్వు మగవాళ్ళతో పేకాడావా అని!" అన్నాడు జోగినాథం.

రమేష్ కోపం యింకా పెరిగింది. అతనావేశపడుతున్నాడని గ్రహించి గంగాధరం అతని భుజంతట్టి—"ఆవేశపడకు రమేష్! నీ తడాఖా చూపించు..." అన్నాడు.

రమేష్ తన పందెం గురించి గట్టిగా చెప్పి-ఎవరైనా సరే ముందుకు రావచ్చునని అన్నాడు.

అక్కడ కూర్చున్న మగవారిలో ఈ పందెం చెప్పాకో దగ్గ సంచలనం కలిగించింది. అద్భుత సౌందర్యంతో వెలిగిపోతున్న ఆ అమ్మాయిల వయసు సొగసుల్ని చూసి ఆనందించవచ్చునన్న ఆశతో చాలామంది ముందుకు వచ్చారు. ఆట ప్రారంభమైంది.

రమేష్ పది ఆటలు ఆడాడు. ఆటకు రెండువేలు

చొప్పున ఇరవై వేలు సంపాదించాడతను. ఆటమీద ఆట రమేష్ నెగ్గుతుంటూ వస్తూంటే ఆ అమ్మాయిలిద్దరూ ఉత్సాహంగా చప్పట్లు కొట్టేస్తున్నారు.

“మిస్టర్ జోగినాథం-ఆర్ యు ప్రిపేర్డ్” అన్నాడు రమేష్.

“ఒక చిన్న రిక్వెస్ట్...” అన్నాడు జోగినాథం... “నేను మనుషులను బాధపెట్టలేను. ఆడపిల్లల మనసులనయితే అసలే బాధపెట్టలేను. ఈరోజు ఇప్పుడు ఇక్కడ మొట్టమొటిసారిగా రమేష్ నా చేతిలో ఓడిపోయాడనుకోండి. అప్పుడీ అమ్మాయిలిద్దరూ-ఇంతమంది ప్రేక్షకుల ముందు బట్టలు విప్పాలి. ఏ ఆడదానికైనా అదెంతో బాధాకరమైన విషయం. ఈ విషయంలో ఆ అమ్మాయిలిద్దరూ చెప్పుకోవలసిందేమైనా ఉన్నదా అని తెలుసుకోగోరుతున్నాను.”

ఇద్దరమ్మాయిలూ హేళనగా జోగినాథంవంక చూసి- “మా బాధ గురించి మీరు పట్టించుకోనవసరంలేదు. రమేష్ ఇష్టమే మా యిష్టం...తప్పించుకోవడంకోసం టైము వేస్టుచేయక వెంటనే ఆట ప్రారంభించండి...” అన్నారు.

“అయితే సరే...” అన్నాడు జోగినాథం. “మీ ముందు బట్టలు విప్పడానికి యీ ఆడపిల్లలు సిగ్గులేదంటున్నారు. బాగానే వుంది. అయినా ఆ పని మీరెవ్వరూ చేయించలేకపోయారు. ఇప్పుడు నేను చేయించబోతున్నాను. సహజంగా ఇది మీ కానందాన్ని కలిగిస్తుంది. అందుకు ప్రతిఫలంగా మీరంతా కలిసి నాకో ఐదువేలిచ్చారంటే-రమేష్‌వద్ద నేను గెల్చుకోబోయే మొత్తంతో కలిపి- మొత్తం పాతికవేలవుతుంది...”

"అప్పుడే ఆటలన్నీ నెగ్గినట్లు మాట్లాడుతున్నావ్" అన్నాడు రమేష్.

"నేను భవిష్యత్ లోకి చూడగలను..." అంటూ జోగినాథం ఒక్క నిముషం కళ్ళు మూసుకుని యేదో ధ్యానిస్తున్నట్లుండిపోయాడు. తర్వాత నెమ్మదిగా కళ్ళు తెరిచి "పేకలు కలుపు..." అన్నాడు రమేష్‌తో.

రమేష్ పేక కలిపాడు. కలిపిన పేకను టేబిలుమీద స్ప్రెడ్ చేశాడు. అందులోంచి జోగినాథం మూడు ముక్కలు తీసుకున్నాడు. రమేష్ మూడుముక్కలు తీసుకున్నాడు.

"ముక్కలు తిరగేయ్—" అన్నాడు జోగినాథం.

రమేష్ ముఖంలో భయంలేదు కానీ మరీ అంత సంతృప్తికరంగా లేవతని భావాలు. అతను తిరగ వేసిన మొదటిముక్క ఆసు.

"రెండోదికూడా!" అన్నాడు జోగినాథం.

రెండు, మూడు ముక్కలు తిరగేశాడు రమేష్... కింగూ, కింగూ...

"మరి నా ముక్కలు చూడు..." అన్నాడు జోగినాథం.

అవిచూస్తూనే రమేష్ ప్రాన్పడిపోయాడు. అమ్మాయిలిద్దరూ నీళ్ళుగాపోయారు. అవి మూడూ ఆసులే!

"కంగ్రాట్యులేషన్స్ జోగినాథం. అయిదు వేలూ నీకిచ్చుకుంటాం. అద్భుతమైన ప్రదర్శన ఇప్పుడు జరుగబోతోంది. ఇద్దరు బంగారు బొమ్మలు...అహం నిండిన ప్రాణులు...రమేష్‌కు తప్ప లొంగని రమణులు...ఈ రోజు మా ముందు..." అంటూ ఓ యువకుడు ఉత్సాహంగా గెంతుతూ ముందుకు వచ్చాడు.

9

"ఈ డబ్బు నేను కష్టపడి సంపాదించినది. మళ్ళీ నాకు తిరిగి ఇవ్వనక్కర్లేదు. వెళ్ళి నీ బిడ్డను విడిపించు కోమ్మా..." అన్నాడు జోగినాథం, మాలతికి పదివేలిస్తూ. అతను క్లబ్ లో గెలిచిన మిగతా పదిహేను వేలను క్లబ్ లోని బ్యాంకులోనే డిపాజిట్ చేశాడు.

"అన్నయ్యా..." అంది మాలతి. ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి. పక్కనే ఉన్న ఆమె భర్త-"మీరు సామాన్యులు కారు. మిమ్మల్ని మొదట్లో చాలా తక్కువ అంచనా వేశాను..." అన్నాడు.

"మాలతి నాకు చెల్లెలు కాబట్టి మనమంతా ఒక గూటి పక్షులం. ఒకళ్ళ నొకరు మన్నించుకోనవసరం లేదు. నా వేషాన్నిబట్టి నన్ను చిన్న చూపు చూడడం అందరికీ సహజమే! అయితే నా వేషాన్ని చూసికూడా మాలతి నన్నాదరించింది. అప్పుడామె ఆదుకోకపోతే నేనేమైపోయి ఉండేవాడినో-ఇప్పుడీ డబ్బు ఇచ్చినా ఆ ఋణం మాత్రం తీరదు..." అని అక్కణ్నించి వెళ్ళిపోయాడు జోగినాథం.

తర్వాత భార్యాభర్త లిద్దరూ కర్తవ్యమేమిటో ఆలోచించారు. భర్త వెళ్ళి సూచనల ప్రకారం డబ్బిచ్చి వస్తానని బయల్దేరాడు.

బస్ స్టాండ్ లో రామాకిళ్ళీ షాపు ముందు నిలబడ్డాడు మాలతి భర్త. అతనక్కడ నిలబడ్డ అయిదు నిముషాలకు నీలం రంగు పాంటు, తెల్లచొక్కా వేసుకున్న యువకు డొకడు అక్కడికి వచ్చాడు.

"మీ పేరు గోపీనాథ్ కదూ-" అన్నాడతను.

"నీ పేరు మూర్తి కదూ-" అన్నాడు మాలతి భర్త గోపీనాథ్.

ఆదివారి సంకేతం.

"తెచ్చారా?" అన్నాడు మూర్తి.

"తెచ్చాను!" అన్నాడు గోపీనాథ్.

మూర్తి అక్కణ్నించి పక్కనే ఉన్న హోటల్‌కు వెళ్ళి ఎక్కడికో ఫోన్ చేసివచ్చి "మరో పావు గంటలో ఓ ముసలమ్మతో కలిసి మీ ఆవిడ, పిల్లాడు ఇక్కడికి రిక్షాలో వస్తారు. వాళ్ళను చూస్తూనే మీరు నాకు ఇచ్చెయ్యండి. లెక్క సరిపోతే- రిక్షాలోంచి ముసలమ్మ దిగి పోతుంది. ఆ స్థానంలో మీరు కూర్చుని ఇంటికి వెళ్ళి పోవచ్చు. ఏమైనా మోసముంటే-" అని స్వరం తగ్గించి "మీ భార్యా పిల్లాడు, రిక్షాలోనే చచ్చిపోతారు..." అన్నాడు గోపీనాథ్‌తో.

గోపీనాథ్ అన్నింటికీ తలూడించాడు.

"మీ పిల్లాడు మీకు దక్కాడని సంతోషించాలి తప్పితే-ఇంకే విధమైన ఆరాలూ తీయకూడదు. అందు వల్ల అనవసరంగా ఇబ్బందుల్లో పడిపోతారు..." అన్నాడు మూర్తి.

"మేము చాలా సామాన్యులం- మాకిన్నిసార్లు చెప్పడం అనవసరం. మాకొకరివల్లనే కానీ మావల్ల ఎవరికీ ప్రమాద ముండదు..." అన్నాడు గోపీనాథ్.

తర్వాత కొంతసేపటికి అక్కడికి ఓ రిక్షావచ్చింది. అందులో మూర్తి చెప్పిన విధంగానే ముసలమ్మ, మాలతి, తనకొడుకు ఉన్నారు. గోపీనాథ్ వెంటనే మూర్తికి ఓ కవరు అందించాడు. అయిదు నిముషాల్లో మూర్తి పక్కకు వెళ్ళివచ్చి-పాట పాడుతున్నట్లుగా ఈలవేశాడు. రిక్షాలోంచి ముసలమ్మ దిగిపోయింది.

ఉత్సాహంగా రిక్షాదగ్గరకు వెళ్ళాడు గోపీనాథ్.

అప్పుడే మాలతి అతన్ని చూసి - "ఏమండీ!" అంది ఆనందం, దుఃఖం మేళవించిన కంఠంతో. గోపీనాథ్ మాట్లాడలేదు. అతనికి మాటరావడంలేదు. కొడుకు వంకే చూస్తున్నాడు. తను మళ్ళీ చూడగలనా లేదా అనుకున్న కొడుకు తన కళ్ళెదుట కనపడుతూంటే నోట మాట రాకపోవడం ఏ తండ్రికైనా సహజం. అతను ఛటుక్కున రిక్షా ఎక్కి కొడుకును దగ్గరగా తీసుకున్నాడు.

"ఎక్కడికి వెళ్ళాలండీ!" అన్నాడు రిక్షావాలా. మాలతి చెప్పగానే రిక్షా కదిలింది.

అంతవరకూ ఆ దృశ్యాన్ని చూస్తూ నిలబడ్డ మూర్తి సంతృప్తిగా తలాడించి-అక్కణ్నించి కదిలాడు. అయితే కొద్దిపాటి దూరంలో తన ననుసరిస్తున్న వ్యక్తి నతను గమనించలేదు. అయినా బికారి వాడిలా ఉన్న జోగినాథాన్ని ప్రత్యేకంగా గమనించే వ్యక్తులు చాలా తక్కువ. అతని గురించి బాగా తెలిసినవారు మాత్రమే అతని గురించి పట్టించుకోవలసిన అవసరం గమనిస్తారు.

10

"మిస్టర్ సాంబయ్యా! డబ్బు రెడీ అయిందా."

"అయిందండి..."

"అయితే శంకరమఠం వీధిలో-రామాలయం మీంచి అజంతా కేఫ్‌కి వెళుతూంటే వచ్చే మూడో ఇంటికి ఇంకో గంటలో డబ్బుతోసహా బయల్దేరిరా. నువ్వొక్కడివే రావాలి. ఈ విషయం ఇంకెవరికైనా తెలిసిందా- మీ అబ్బాయి శవాన్ని మాత్రమే చూస్తావు..."

"అన్నీ తెలుసు నాకు..."

"నిన్ను నా అనుచరులు వెయ్యి కళ్ళతో కనిపెడు

తున్నారు. ఏదైనా తెలివి తక్కువ పనిచేస్తే వాడు తెలియకుండా తప్పించుకోగల ననుకోకు."

"మీరేమీ చెప్పనక్కర్లేదు... నేను బ్రతికేదే నా కొడుకు కోసం. వాడెలాగున్నాడు? మా కోసం బెంగ పెట్టుకోలేదు గదా..."

"కుర్రాడు చాలా ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉన్నాడు-ఇంతవరకూ. ఆ తర్వాత సంగతి నీ ప్రవర్తన మీద ఆధారపడి ఉంది..." ఫోన్ క్లిక్ మంది.

తనూ రిసీవర్ పెట్టేసి కళ్ళు తుడుచుకున్నాడు సాంబయ్య. ఆయన మనసు నిండా కొడుకు గురించిన ఆలోచనలే...అక్కణ్ణించి ఆయన వెంటనే రిక్షా కట్టించుకుని ఇల్లు చేరాడు. ఇంటి దగ్గర ఆయనకోసం ఆత్రుతగా ఎదురు చూస్తోంది భార్య.

"ఏమండీ-ఏమయింది..." అందావిడ.

"అన్న ప్రకారమే ఆఫీసుకు ఫోన్ చేశాడు. డబ్బు రెడీగా ఉందా అన్నాడు. ఉందని చెప్పాను. అయితే తీసుకుని రమ్మని చెప్పాడు. నేను వెళుతున్నాను. నువ్వేమీ కంగారు పడకు. ఓ రెండు గంటల్లో మనబాబుని తీసుకుని వచ్చేస్తాను..." అన్నాడు సాంబయ్య.

"అసలిదంతా ఏమిటండీ-" అంది సాంబయ్య భార్య.

"మనకర్మ...అంతకంటే ఏం చెప్పను?" అన్నాడు సాంబయ్య.

సాంబయ్య లోపలకు వెళ్ళి అలమారాలోంచి డబ్బు తీసి లెక్కపెట్టాడు. సరిగ్గా యాభైవేలు. ఆ డబ్బుని చిన్న తోలు సంచీలో వేసుకుని అక్కణ్ణించి బయటకు వచ్చాడు. ఆయన బయల్దేర బోతూంటే మెట్లమీదే వారి పురోహితుడు అవధాని ఎదురయ్యాడు.

"ఏమండీ-లోపలకు రండి..." అంది సాంబయ్య భార్య. ఆనిక ఉద్దేశాన్ని గ్రహించిన సాంబయ్య లోపలకు దారితీశాడు.

"బాబుగారెక్కడికో పెద్ద పనిమీదే బయల్దేరినట్లున్నారు. నన్నడిగితే ప్రయాణం వాయిదా వేసుకోమంటాను. సమయం యేమాత్రమూ అనుకూలంగా లేదు..." అన్నాడు అవధాని.

సాంబయ్య విసుగ్గా-"అసలే ఒంటి బ్రాహ్మడు శకునం వచ్చినందుకు బెంగపడుతూంటే-మళ్ళీ ఇదొకటా..." అనుకుని దొడ్లోకి వెళ్ళి కాళ్ళు కడుక్కుని వచ్చి, కాసిని మంచినీళ్ళు తాగి-"అయ్యా-అవధానిగారూ! మీరు అన్యథా భావించక-మాట్లాడవలసిన విశేషాలన్నీ మా ఆవిడతో మాట్లాడండి. సమయం అనుకూలంగా వున్నా లేకపోయినా నాకు బయటకు వెళ్ళక తప్పదు..." అని అక్కణ్నించి వెళ్ళిపోయాడు.

"అలాటలిఖితం...ముందుగా తెలిసినా తప్పించుకోలేంగదా..."

సాంబయ్య భార్య కంగారుగా "సమయం బొత్తిగా అనుకూలంగా లేదంటారా?" అంది. ఆవిడ కళ్ళలోని ఆత్రుతను ఆశ్చర్యంగా గమనిస్తూ "అవునమ్మా-అందుకే హెచ్చరించాను. అయినా యేదో చెప్పడమేకానీ-అంతా మన చేతుల్లో ఉందా యేమన్నానా"అన్నాడు అవధాని.

సాంబయ్య భార్య గుండెలు గుబగుబలాడాయి. రాజారావు ఎలా ఉన్నాడోనని ఆవిడ మనసు కలవరపడసాగింది.

11

సాంబయ్య అయిదారు నిముషాలు బాగా పరీక్షించి ఆ యింటి తలుపు తట్టాడు.

ఓ కుర్రాడు తలుపుతీసి - "మీ పేరు సాంబయ్య గారా?" అన్నాడు. అవునని సాంబయ్య చెప్పగానే లోపలికి తీసుకువెళ్ళి - "ఆ గదిలోకి వెళ్ళండి..." అని ఓ మూల గది చూపించాడు.

సాంబయ్య ఆత్రుతగా ఆ గదిలోకి వెళ్ళాడు. ఆయన లోపలకు వెళ్ళగానే ఆ గది తలుపులు మూసుకున్నాయి. సాంబయ్య గదిలో అటూ ఇటూ చూసి ఆశ్చర్యపోయాడు. ఆశ్చర్యం ఆనందంగా మారడానికి ఎన్నో క్షణాలు పట్టలేదు. గదిలో ఉన్న ఒకే ఒక వ్యక్తి ఆయన కొడుకు రాజారావు!

"నాన్నా!" అన్నాడు రాజారావు. సాంబయ్య ఒక్క ఉదుటున వెళ్ళి కొడుకును గట్టిగా కౌగలించుకున్నాడు. ఆ పరిష్వంగంలోని సుఖం ఆ పితృ హృదయానికే తెలియాలి.

ఓ అయిదు నిముషాల అనంతరం ఆ గదిలోకి తలుపులు తీసుకుని నిండా ముసుగున్న వ్యక్తి ప్రవేశించి-"వెల్ మిస్టర్ సాంబయ్యా! డబ్బిలాగియ్యి-" అన్నాడు.

సాంబయ్య అతనికి తన చేతిలోని తోలుసంచీ అందించాడు. ఆ ముసుగు వ్యక్తి అందులోని డబ్బు తీసుకుని లెక్కపెట్టుకున్నాడు. తర్వాత తన జేబులోంచి ఏదో కాగితం తీసి ఆ నోట్లను మళ్ళీ పరిశీలించాడు.

"మిస్టర్ సాంబయ్యా-నా దగ్గరున్న నంబర్లతో నువ్విచ్చిన నోట్ల నంబర్లు సరిపోయాయి. అంటే గోపీనాథ్ గారబ్బాయిని దాచేసి పదివేలు వసూలు చేసింది నువ్వే నన్నమాట!" అన్నాడు ముసుగు మనిషి.

సాంబయ్య ఉలిక్కిపడ్డాడు - "మీరేమంటున్నారో నాకు తెలియదు..."

"బుకాయించి ప్రయోజనంలేదు. నీవు డబ్బిచ్చిన గోపీనాథ్ ఆ నంబర్లు నోట్ చేసుకున్నాడు. గోపీనాథ్‌కి డబ్బిచ్చి సాయంచేసిన అతను కూడా నంబర్లు నోట్ చేసుకున్నాడు. ఆ నంబర్లు నువ్విచ్చిన నోట్లవున్నాయ్."

"ఇంతకీ మీరెవరు?" అన్నాడు సాంబయ్య.

ముసుగు వ్యక్తి ముసుగును తొలగించాడు. అతను ఫుల్ యూనిఫాంలో ఉన్న పోలీసు అధికారి_"ఎస్ అయాం ఇన్‌స్పెక్టర్ నరేష్!" అన్నాడతను.

సాంబయ్య కంగారుగా_"యేమిటిది ఇన్‌స్పెక్టర్_సామాన్య గుమాస్తాని. నా పిల్లాడిని దాచేసి ఉన్న పళంగా యాభై వేలు కావాలంటే యేం చేసేది? వాళ్ళనీ వీళ్ళనీ బెదిరించి డబ్బుపోగుచేసుకున్నాను..."అన్నాడు.

"అది సరే - ఇలాంటి పరిస్థితుల్లో సామాన్యగుమాస్తా అయితే తెగించి యే దొంగతనానికో, దారి దోపిడీకో వెళ్ళి పట్టుబడేవాడు. కానీ చేతిలో ముఠా సిద్ధంగా ఉన్నవాడే అప్పటికప్పుడు ఇలాంటి యేర్పాట్లు మరికొన్ని చేయగల్గుతాడు. నీ క్రింద పెద్ద ముఠా ఒకటి ఉన్నదని వార్తలు ఇదివరలోనే వచ్చాయి. అది ఈ పథకం రూపంలో ఈనాడు బుజువయింది."

"ఇన్‌స్పెక్టర్_నా బాబుని అపహరించింది పోలీసులా?" అన్నాడు సాంబయ్య ఆశ్చర్యంగా భయంగా.

"అవును. ఒకతను ఈ పథకం వేశాడు. సామాన్య గుమాస్తా యాభై వేలైనా ఇవ్వగలుగుతాడనీ_ఆ డబ్బు ఎలా వచ్చిందో తెలుసుకుంటే అతని గుట్టు బయటపడుతుందనీ చెప్పాడు. అతనొక సీబీఐ అధికారి కావడంతో నేను రంగంలోకి దిగాను. నీ కొడుకును అతనే దాచాడు. కానీ ఈ రోజు నేను వచ్చాను..." అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"మీరు అన్యాయంగా నామీద నేరారోపణ చేస్తున్నారు. నాకే పాపం తెలియదు." అన్నాడు సాంబయ్య.

"మా దగ్గర చాలా బలమైన సాక్ష్యాలున్నాయి. మూన్ లైట్ నైట్ క్లబ్ యజమానికూడా ఈరోజే పట్టుబడ్డాడు! మన ఊళ్ళోని ప్రముఖ వ్యాపారస్థుడు కోటేశ్వరరావు దానికి రహస్య యజమాని. అక్కడ చాలా అన్యాయాలు, అక్రమాలు జరుగుతున్నాయి. ఆ నైట్ క్లబ్ లో డబ్బు డిపాజిట్ చేసిన ఒకతను ఆ నోట్ల నంబర్లన్నీ గుర్తుంచుకున్నాడు. మర్నాడా నంబరుగల నోట్లు యే బ్యాంకుకు వచ్చినా గుర్తించి చెప్పవలసిందిగా రహస్యపు ఆజ్ఞ జారీచేయగా-అవి కోటేశ్వరరావు అకౌంట్లో జమచేయబడినట్లు తెలిసింది. ఆ ఆధారంలో ఆయన పట్టుబడ్డాడు. ఒక దాని వెనుక ఒకటిగా బోలెడు సాక్ష్యాలు దొరికాయి. సాక్ష్యాలలో కొన్ని నీ నేరాన్నికూడా బయట పెట్టాయి. కోటేశ్వరరావు ముఖ్యానుచరులలో నువ్వొకడివని చెప్పటానికి..."

"ఆగండి ఇన్ స్పెక్టర్!" అన్నాడు సాంబయ్య - "మా బాస్ కోటేశ్వరరావు పట్టుబడ్డాక ఇంకా నిజాలు దాచడమెందుకు? నేను ఆయన అనుచరుణ్ణేకాక-ఓ చిన్న సైజు ముఠా నాయకుణ్ని. నాక్కావలసిన డబ్బు సంపాదించుకోవడం నాకు తెలుసు. నా పాపం మూడింది నాకర్మ కాలింది.." అన్నాడు పశ్చాత్తాపపడుతూ.

12

"అమ్మా-మాలతీ!"

"ఎవరది-అన్నయ్యా-" అంది ఆశ్చర్యంగా మాలతి.

"నా పని ముగిసిందమ్మా-అనుకున్న కార్యం సాధిం

చాను. నీకు మాటిచ్చిన ప్రకారం మీ ఇంట్లో స్నానం చేద్దామని వచ్చాను...'' అన్నాడు జోగినాథం.

అప్పుడే అక్కడికివచ్చిన గోపీనాథ్ - ''మా అదృష్టం. మా ఇంట్లో మీ స్నానం మా ఇంటినే పునీతం చేస్తుంది'' అన్నాడు ఆహ్వానపూర్వకంగా.

జోగినాథం మాలతి ఇంట్లో స్నానం చేస్తున్న సమయంలో సాంబయ్య భార్య తన భర్తకు ఎదురొచ్చిన పురోహితుడు అవధానిని తిట్టుకుంటోంది. ఆ తప్పు అవధానిది కాదు, జోగినాధానిదనీ, ఆ మాటకొస్తే సాంబయ్యదేననీ ఆవిడకు తెలియదు.

—: అ యి పో యిం ది :—